# గడ్డిమేసిన ప్రభువులు

'నా నోటివెంట మాటరావడం తడవుగా 'చిత్తం చిత్తం' అంటూ దాన్ని మింగేసి పూరుకునేవాళ్లను చూస్తే నాకు పరమ అసహ్యమోయి శేషయ్యా'

'చిత్తం! అసహ్యమేనండి తమకు'

'నేను చెప్పేదాన్ని కొంచెమేనా విని అందులో సబబూ సందర్భమూ వుందో లేదో గమనించి మరీ చిత్తం చిత్తం అంటూ ఊకట్టాలి గాని—'

'చిత్తం! అంతేనండి'

'నేను చెప్పేది ప్రతీదీ వేదవాక్యమే అనుకుని, దానికి తిరుగులేదనుకుని, అది నా నోటివెంట రాక పూర్వమే 'చిత్తం' అనడానికి ఆయత్తపడేవాళ్ల మీద నాకు ఎంతమాత్రమూ గౌరవం వుండదు—'

'చిత్తం! ఎందుకుంటుందండీ?'

"చూడు శేషయ్యా! నేను గొప్పవాడినే కావచ్చు. అనేకమంది నాకు సేవకులే కావచ్చు. అనేకమంది నేను శాసించిన ప్రకారం చేయడమే తమవిధిగా భావించుకోవచ్చు. కాని, నేను చెప్పిన ప్రతిదానికీ తిరుగులేదనుకోవడం—'

'చిత్తం—'

'నేను చెప్పిన ప్రతిదానికీ తిరుగులేనుకోవడం—'

'చిత్-త్—'

'తిరుగులేదనుకోవటం ఏమిటనుకున్నావ్!—'

'చిత్తం-ఏమనుకున్నానండీ?'

'పరమ మూర్ఖత!'

'చిత్తం! పరమమూర్ఖతేనండి. కాదనగలనా?'

'నేను సాధారణంగా తెలివితేటలుగానే మాట్లాడతాననుకో. కాని, ఏ కారణం చేతనైనా నేను అవుకు మూడేకాళ్లంటే...'

---

ఎం. ఎస్. మూర్తి

---




'చిత్తం! మీరు చెప్పిన ఆవుల్లాటివి లేక పోలేదండి—'

'వున్నాయా? శేషయ్యా, ప్రపంచంలో అలాటి ఆవులున్నాయా? వుంటే యిన్నాళ్ళనుంచీ చెప్పావుకావేమోయి?'

'చిత్తం! తమకు తెలియకపోతుందా అని దేవరవారితో చెప్పడానికి సాహసించ లేకపోయానండి—'

'ఓహో! అలాగనా! సరే, చూడు శేషయ్యా, ఇకముందు మాత్రం అలాంటి వింతలేమైనావుంటే నాతో చెప్పడం మానకు—ఇంతకూ—ఆవుని నువ్వుచూశావా?'

'చిత్తం! నాలుగోకాలు విరిగిపోయి మూడేకాళ్ళు మిగిలిన ఆవుల్ని చాలా చూశానండి–'

'ఈమాటు అలాటి ఆవు కనపడితే ఎంత ఖరీదైనాసరే ఇచ్చి కొనుక్కురా— తెలిసిందా?'

'చిత్తం! తప్పకుండా! ప్రభువుల ఆజ్ఞ దాటగలనా?'

'అయితే శేషయ్యా! నిజంగా అటువంటి అవు—మూడు కాళ్ళతో మిగిలిన ఆవు వింతకాదూ?'

'చిత్తం! కాదని అనడానికి ఎవరు సాహసిస్తారూ తమముందర?'

'రైట్! అలాంటి వింత అవును మనం కొనితేవడం అవసరంకదూ?'

'చిత్తం! ముమ్మాటికీ అవసరమేనండి?'

'అయితే చూడు శేషయ్యా, నీకేం మతి చెడిందా?'

'చిత్తం! ఏలినవారు తలిస్తే—'

'శుద్ధ వెర్రివెధవ్వోయి నువ్వు!'

'చిత్తం! తప్పకుండా!'

'మూడు కాళ్ల ఆవేమిటోయి? మతిలేని మాట?'

'చిత్తం! తమరు చెప్పింది సరేనండి'

'నాలుగోకాలు విరిగిపోయినంత మాత్రాన అది మనకు వింత ఎలాగవుతుంది? శుద్ధ చవట వెధవ్వోయి నువ్వు!'

'చిత్తం. ముమ్మాటికీనండి'

'పైపెచ్చు నాలుగో కాలు విరిగిపోయిన ఆవు మనకి అవసరమని కొని తెస్తానంటావు కూడానూ! ఇంత వెధవ ముండ ఆలోచన...'

'చిత్తం. ఇంత బోడి ముండ ఆలోచన!'

'అటువంటి ఆవు విచిత్రమనీ దాన్ని కొని తేవాలని నేనే చెప్పాననుకో-'

'చిత్తం, ఏలినవారు అబద్ధాలాడతారా? మీరే చెప్పారు—'

'నేనే చెప్పినప్పటికీ-ఇటుచూడు శేషయ్యా- నీ బుద్ధి ఎక్కడ తగలబడి పోయిందోయి-వెధవమ్మా!'

'చిత్తం. నేను అప్పుడే అనుకున్నానండి—'

'ఏమని?'

'చిత్తం. తమరు—'

'ఏమిటి శేషయ్యా? ఏమనుకున్నావు? చెప్పు త్వరగా-'

'చిత్తం! తమరు గడ్డితింటున్నారనీ, తమర్ని గడ్డితినకుండా చేయాలనీ—ఈ అవసరం నాకు అప్పుడే తెలిసివచ్చిందండి!'

*